క్లుప్తంగా

ప్రైమరీ అసోసియేషన్ అండ



నోట్‌బుక్‌లు అందిస్తున్న సంస్థ సభ్యులు

నిర్మల్‌రూరల్: మండలంలోని వెంగాపేట్ ప్రాథమిక పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు శనివారం గ్రామంలోని ప్రైమరీ అసోసియేషన్ సభ్యులు రూ.70 వేల విలువైన నోట్‌బుక్‌లు అందించారు. నర్సరీ నుండి ఐదో తరగతి వరకు చదువుతున్న 190 మందికి నోట్‌బుక్‌లు అందించారు. ప్రధానోపాధ్యాయులు తేజ, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవోలను నియమించాలి

ఖానాపూర్: జిల్లాలో ఖాళీగా ఉన్న మండలాల్లో ఎంఈవో పోస్టులను పూర్తిస్థాయిలో భర్తీ చేయాలని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్ అన్నారు. శనివారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పూర్తిస్థాయి ఎంఈవోలు లేక.. ఇన్‌చార్జులతో కాలం వెల్లదీస్తున్నారని పేర్కొన్నారు. మండలానికో రెగ్యూలర్ ఎంఈవోను నియమించాలని కోరారు. రాసమల్ల అశోక్, రాకేశ్ తదితరులు ఉన్నారు.

సకాలంలో రుణం అందించాలి

భైంసాటౌన్: బీసీ కులవృత్తుల వారికి ప్రభుత్వం అందిస్తున్న రూ.లక్ష రుణ ఆర్థికసాయం సకాలంలో అందించాలని బీసీ హక్కుల పరిరక్షణ సమితి జిల్లా కోఆర్డినేటర్ సుంకెట పోశెట్టి డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందించారు. దరఖాస్తుదారులకు ఎందుకు రుణసాయం అందిస్తలేరో అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

'సీఎం కుటుంబమే బాగుపడ్డది'



మాట్లాడుతున్న మోహన్‌రావు పటేల్

కుభీర్: ప్రత్యేక రాష్ట్రంలో నీళ్లు, నియమకాలు జరగకున్నా.. సీఎం కేసీఆర్ కుటుంబం మాత్రం బాగుపడ్డదని బీజేపీ నాయకులు మోహన్‌రావ్‌పటేల్ అన్నారు. శనివారం మండలంలోని రాంజీనాయక్ తండా, దొడర్నా తండా-1, దొడర్నా తండా-2లో గడపగడపకూ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్‌లు రాథోడ్ శంకర్, జాదవ్ సునీత, మాజీ ఎంపీపీలు సుభాష్, యోగిత, పండిత్, కమ్‌లేశ్, మనోజ్ తదితరులు ఉన్నారు.

రోడ్లపై కేజీవీల్స్ నడపొద్దు

ఖానాపూర్: రోడ్లపై కేజీవీల్స్ ట్రాక్టర్లు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఆర్. శంకర్ అన్నారు. శనివారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ట్రాలీల ద్వారా ట్రాక్టర్లను తీసుకెళ్లాలని సూచించారు. కేజీవీల్స్‌తో రోడ్లు దెబ్బతింటే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ఆయా గ్రామాల ట్రాక్టర్ యజమానులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

ఉపాధ్యాయుల కొరత తీర్చాలి

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీర్చాలని కోరుతూ శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈవో కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందించారు. అంతకుముందు పాఠశాలలో జరిగిన ఎస్ఎంసీ సమావేశంలో ఈ విషయమై తీర్మాణం చేశారు. పాఠశాలలో 190 మంది విద్యార్థులున్నారు. ఉర్దూ మీడియంలో 110 మంది విద్యార్థులు ఉండగా వారికి ఏడుగురు ఉపాధ్యాయులు బోధించాల్సి ఉండగా నలుగురు మాత్రమే ఉన్నారన్నారు. ఖాళీగా ఉన్న మూడు ఉపాధ్యాయ పోస్టులు, ఓ పీడీ పోస్టును భర్తీ చేయాలని కోరారు. హెచ్ఎం రవిబాబు, ఎస్ఎంసీ సభ్యులు పోశెట్టి, అయూబ్‌ఖాన్, నశీర్, హైమద్, రఫిబాబా తదితరులున్నారు.

రోడ్డెక్కిన విద్యార్థులు..!



ధర్నా చేస్తున్న విద్యార్థులు

భైంసాటౌన్: పట్టణంలోని కిసాన్‌గల్లి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు రోడ్డెక్కారు. పాఠశాలలో మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. శనివారం పేరెంట్స్ మీటింగ్ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించగా, పాఠశాలలో అసౌకర్యాలపై ఉపాధ్యాయులను నిలదీశారు. మన ఊరు-మన బడిలో నిధులు మంజూరైనా పనులు చేపట్టడం లేదని తల్లిదండ్రులు ఆరోపించారు. ఉపాధ్యాయులు సర్దిచెప్పే ప్రయత్నం చేసినా పాఠశాల ఎదుట రోడ్డుపై ధర్నా చేశారు. ఎంఈవో సుభాష్ దృష్టికి తీసుకెళ్లగా మన ఊరు-మన బడి జేఈ భార్గవ్‌తో మాట్లాడి అవసరమైన వసతులు కల్పిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

టిఫిన్స్ ఆన్ వీల్స్..

• మొబైల్ టిఫిన్ సెంటర్లకు డిమాండ్

నిర్మల్‌ఖిల్లా: వర్షాకాలంలో వేడి వేడి వంటకాలు నోరూరిస్తాయి. ఇంట్లో సమయం ఉంటే ఏదైనా చేసుకు తింటాం. కానీ ఆధునిక జీవితంలో ఉద్యోగం, వ్యాపారాల కారణంగా ఎవరికీ తీరిక ఉండటం లేదు. దీంతో పట్టణవాసులు బయటి ఫుడ్(టిఫిన్లు, స్నాక్స్) తినేందుకు మొగ్గు చూపుతున్నారు. ప్రజల అభిరుచికి అనుగుణంగా ఆహార పదార్థాలు అందిస్తుండటంతో జిల్లాకేంద్రంలో మొబైల్ టిఫిన్ సెంటర్లకు డిమాండ్ పెరుగుతోంది. ఈ టిఫిన్ సెంటర్లతో పలువురు ఉపాధి కూడా పొందుతున్నారు. రుచి, శుభ్రతలో రాజీపడకుండా భోజనప్రియుల మనసు దోచుకుంటున్న మొబైల్ టిఫిన్ సెంటర్లపై కథనం..

- జిల్లా కేంద్రంలో కొత్త ట్రెండ్
- బయటిఫుడ్‌పై భోజనప్రియుల ఆసక్తి
- శుచి, శుభ్రత పాటిస్తున్న నిర్వాహకులు



మారెమ్మ గుడి వద్ద మొబైల్ టిఫిన్ సెంటర్



దోసె వేస్తున్న యువకుడు

టిఫిన్లతోపాటు చేపల రుచులు..

ఇడ్లీ దోశ, వడ, పూరి, ఉప్మా తదితర టిఫిన్లతోపాటు అల్లం, పల్లిచట్నీ లభిస్తుండటంతో వినియోగదారులు ఇష్టంగా తింటున్నారు. శివాజీ చౌక్ నుంచి మంచిర్యాల వెళ్లే మార్గంలో శాంతినగర్ చౌరస్తా వద్ద పలు రకాల చేపల రుచులు అందిస్తున్న మొబైల్ వాహనం ఉంది. సాయంత్రం నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ వంటకాలు అందుబాటులో ఉంటున్నాయి.

సండే స్పెషల్

జిల్లా కేంద్రంలో ఉన్న మొబైల్ టిఫిన్ సెంటర్లకు ఉదయం, సాయంత్రం గిరాకీ ఉంటుంది. భార్యాభర్తలు ఉద్యోగులవడం, ఎక్కువ మంది ఉద్యోగులు, వ్యాపారులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉండటంతో మొబైల్ టిఫిన్ సెంటర్ల వద్దే తినేసి విధులకు వెళ్తున్నారు. సాయంత్రం ఇంటికి వచ్చిన తర్వాత కొందరు పెద్దలు తమ పిల్లలతో బయటి ఫుడ్ తినే సంస్కృతి పెరుగుతోంది.

ఉపాధి పొందుతున్న యువత..

మొబైల్ టిఫిన్ సెంటర్ల ఏర్పాటుతో పలువురు యువత ఉపాధి పొందుతున్నారు. ప్రత్యేకంగా తయారు చేసిన వాహనంలో టిఫిన్ తయారీ యంత్రాలు, వంటసామగ్రి ఏర్పాటు చేసుకొని రోజు ఉదయం కూడళ్ల వద్ద టిఫిన్లు అందుబాటులో ఉంచుతున్నారు. దీంతో భవనం కిరాయి వంటి ఇబ్బందులు తప్పాయని నిర్వాహకులు అంటున్నారు.

జిల్లా కేంద్రంలో ఎక్కడెక్కడంటే..

జిల్లా కేంద్రంలో బస్ డిపో ఎదురుగా, శివాజీచౌక్ వద్ద, మారెమ్మ టెంపుల్ వద్ద, శాంతినగర్ కూడలి వద్ద, కొండాపూర్ బైపాస్ రోడ్డు వద్ద మొబైల్ వాహన టిఫిన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం రద్దీ ఎక్కువ.

ఉదయం, సాయంత్రం గిరాకీ..

తెల్లవారుజామున ఐదు గంటలకే ఏర్పాటు చేసే ఈ మొబైల్ టిఫిన్ కేంద్రాలకు మంచి గిరాకీ ఉంటుంది. సెలవులు, వారంతాల్లో కొంచెం ఎక్కువ ఉంటుందని .. రుచి, శుభ్రతలో రాజీ పడకుండా నాణ్యమైన పదార్థాలతో వంటకాలు చేస్తున్నామని నిర్వాహకులు పేర్కొంటున్నారు. ఉదయం ఆరు నుంచి పది గంటల వరకు.. సాయంత్రం ఆరు నుంచి రాత్రి పదిన్నర గంటల వరకు కస్టమర్ల తాకిడి ఎక్కువ ఉంటుందని మొబైల్ టిఫిన్ సెంటర్ల యజమానులు అంటున్నారు.

తెల్లవారుజామున వస్తాం



నాతోపాటు మా దగ్గర పని చేసే వర్కర్లు తెల్లవారుజామునే వచ్చి వాహనంలో అన్ని వస్తువులు సర్దుతారు. ఉదయం ఆరు గంటల కల్లా టిఫిన్లు సిద్ధం చేస్తాం. మంచి టిఫిన్లు, కర్రీస్, చట్నీలు అందిస్తుండటంతో తినేందుకు వచ్చేవారి సంఖ్య పెరుగుతుంది. ఖర్చులు పోను వస్తున్న ఆదాయం బాగుంది.

– రవిరాజు, మొబైల్ టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు

తీరొక్క రుచులు..



మా మొబైల్ టిఫిన్ సెంటర్ వద్ద సాయంత్రం తీరొక్క రుచుల్లో టిఫిన్లను అందుబాటులో ఉంచుతున్నాం. పరిశుభ్రత పాటిస్తుండటంతో కస్టమర్లు రెగ్యూలర్‌గా మా వద్దకే వస్తుంటారు. మా దగ్గర నేతి దోశకు మంచి డిమాండ్ ఉంది. ధర కూడా తక్కువే.

– రాహుల్ పెన్షవార్, మొబైల్ టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు

చేపల కూర స్పెషల్



జిల్లా కేంద్రంలోని శాంతినగర్ చౌరస్తాలో మొబైల్ వాహనం ఏర్పాటు చేసి వివిధ చేపల రుచులు అందిస్తున్నాం. రోజు సాయంత్రం నుంచి రాత్రి వరకు గిరాకీ ఉంటుంది. తాజా చేపలను వినియోగదారుల సమక్షంలో రుచికరంగా వండుతుండటంతో డిమాండ్ పెరిగింది.

– తోకల సాయేందర్, మొబైల్ టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు

టేస్టు బాగుంటుంది..



జిల్లా కేంద్రంలోని ఓ సంస్థలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నా. ఉదయమే కొన్ని ఊర్లకు వెళ్లి రావాల్సి ఉంటుంది. మొబైల్ టిఫిన్ సెంటర్ వద్ద తిన్న తర్వాతనే అక్కడకు వెళ్తుంటా. టేస్ట్ బాగుంటుంది. మధ్యాహ్నం మాత్రం ఇంట్లో తింటా. తాజాగా తయారు చేసి కస్టమర్లకు అందిస్తున్నారు.

– గోపి, ప్రైవేటు ఉద్యోగి, నిర్మల్

పాఠశాలల్లో బోనాల పండుగ



నిర్మల్‌లోని భగీరథ పాఠశాల విద్యార్థుల ప్రదర్శన



భైంసాలోని గౌతమి హైస్కూల్‌లో..



లక్ష్మణచాంద ద్రోణ పాఠశాలలో..

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని భగీరథ, ఎస్.ఆర్ ప్రైమ్, బృందావనం పాఠశాలల్లో శనివారం బోనాల పండుగ నిర్వహించారు. పురవీధుల గుండా పాఠశాల విద్యార్థులు బోనం ఎత్తుకొని ర్యాలీ తీశారు. అమ్మవారి వేశాధారణ, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాళ్లు రాందాసు, సాయన్నయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భైంసాటౌన్: పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో బోనాల పండుగ నిర్వహించారు. పట్టణంలోని శ్రీ గౌతమి హైస్కూల్‌లో విద్యార్థులు బోనం ఎత్తుకొని సందడి చేశారు.

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని ద్రోణ ఉన్నత పాఠశాలలో బోనాల పండుగ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు గంగాధర్, కరస్పాండెంట్ సురేశ్ రెడ్డి, ఉపాధ్యాయుడు ముత్యం పాల్గొన్నారు.

ముధోల్: మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో శనివారం బోనాల పండుగ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు సారథిరాజు, పోషకులు, ఆచార్యులు పాల్గొన్నారు.

నర్సాపూర్ (జి): మండలకేంద్రంలోని అరవింద స్కూల్ విద్యార్థులు బోనాల పండుగ నిర్వహించారు. బోనాలతో వెళ్లి గ్రామదేవతలకు నైవేద్యం సమర్పించారు. ప్రిన్సిపాల్ పార్వతీ తివారీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని కల్లూర్ వాసవి డిగ్రీ కళాశాలలో బోనాల పండుగ నిర్వహించారు. ప్రిన్సిపాళ్లు గట్టుపల్లి శ్రీనివాస్, సాయిలు, కరస్పాండెంట్లు హరిప్రసాద్, జానకీరాం పాల్గొన్నారు.

తానూరు: మండల కేంద్రంలోని వాగ్దేవి పాఠశాలలో బోనాల పండుగ నిర్వహించారు. ప్రిన్సిపాల్ అర్వింద్‌రెడ్డి, ఉపాధ్యాయులు అవినాష్ ,భోజారాం తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలు

ముధోల్: మండల కేంద్రంలోని రబీంద్ర పాఠశాలలో విద్యార్థులకు శనివారం రిలయన్స్ ఆధ్వర్యంలో కార్గిల్ దివాస్‌పై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. వంద మంది పాల్గొన్న పోటీలో గెలుపొందినవారికి సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ సాయినాథ్, కరస్పాండెంట్ రాజేందర్, డైరెక్టర్ పోతన్నయాదవ్, చైర్మన్ భీంరావు దేశాయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళాశాల ఏర్పాటు చేయాలి

ఖానాపూర్: పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడంలో ఎమ్మెల్యే రేఖానాయక్ విఫలం అయ్యారని ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు ఉదయ్ అన్నారు. శనివారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి దశాబ్దం గడుస్తున్నా కళాశాల ఏర్పాటు ముందుకు సాగడం లేదన్నారు. ప్రభుత్వం ఖానాపూర్‌లో డిగ్రీ, పీజీ కళాశాలలను ప్రారంభించాలని కోరారు.

సమస్యల పరిష్కారంలో విఫలం

ఖానాపూర్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలో ఎమ్మెల్యే రేఖానాయక్ పూర్తిగా విఫలమయ్యారని బీజేపీ నాయకురాలు, పెంబి జెడ్పీటీసీ జానుబాయి అన్నారు. మండలంలోని బావాపూర్(ఆర్)తండాకు వెళ్లే దారిలో తెగిపోయిన కల్వర్టును శనివారం పరిశీలించారు. కల్వర్టు తెగిపోతే గ్రామస్తులమే కలిసి మట్టి పోసుకున్నామని పలువురు జెడ్పీటీసీకి వివరించారు. ఆమె మాట్లాడుతూ దీనిపై త్వరలో జరిగే జెడ్పీ సమావేశంలో లేవనెత్తుతామని పేర్కొన్నారు.

పలువురు బీజేపీలో చేరగా జానుబాయి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకముందు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో విస్తారక్ నరేందర్, మాజీ సర్పంచ్ బాస రాజేశ్వర్, విలాస్, నగేశ్, శ్రీనివాస్, శ్రీకాంత్, సురేశ్, గోపాల్‌రెడ్డి, రవి తదితరులున్నారు.

నాందేవ్ మహారాజ్ పుణ్యతిథి



భైంసాలో పాల్గొన్న సంఘ సభ్యులు

భైంసాటౌన్: పట్టణంలోని నాందేవ్ మహారాజ్ కాలనీలో తమ సంఘం ఆధ్వర్యంలో శనివారం మేరు సంఘం కులస్తులు నాందేవ్ మహారాజ్ పుణ్యతిథి, పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాందేవ్ మహారాజ్ చిత్రపటానికి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం పట్టణ కార్యవర్గ అధ్యక్షులు సరికొండ గంగాధర్, కోశాధికారి సాయినాథ్, కార్యదర్శి సతీశ్ తదితరులు ఉన్నారు.

లోకేశ్వరం: మండల కేంద్రంలోని మేరు సంఘ భవనంలో శనివారం సంత్ నాందేవ్ మహారాజ్ 673వ పుణ్యతిథిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంత్ నాందేవ్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. కార్యక్రమంలో మేరు సంఘం మండలాధ్యక్షుడు వెన్నెవార్ శివకృష్ణ, కార్యదర్శి గంగాధర్, సాయినాథ్, సింగు వినోద్, ముత్యం, పెద్దరాజు, లక్ష్మి తదితరులు ఉన్నారు.

మానవత్వం చాటిన మున్సిపల్ చైర్మన్



చికిత్స చేయిస్తున్న ఈశ్వర్

నిర్మల్‌టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారిని ఆసుపత్రిలో చేర్పించి మానవత్వం చాటారు మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్. జిల్లా కేంద్రంలోని చైన్‌గేట్ ప్రాంతంలో శనివారం ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ప్రమాదవశాత్తు ఇద్దరు చిన్నారులు, మరో ఇద్దరు పెద్దలు కిందపడ్డారు. ఆ సమయంలో అటు వెళ్తున్న మున్సిపల్ చైర్మన్ వెంటనే తన కారుని ఆపించి వారిని దేవేందర్‌రెడ్డి ఆసుపత్రికి తీసుకెళ్లారు. దగ్గరుండి చికిత్స చేయించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉంది. వారి వెంట రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు అధికారి విజయ్ ఉన్నారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ

జిల్లా కేంద్రంలోని చైన్‌గేట్ ప్రాంతంలో ప్రభుత్వ షెడ్యూల్డ్ బాలికల వసతిగృహాన్ని శనివారం మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ పరిశీలించారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అందించే పాఠ్యపుస్తకాలు, దుప్పట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. కౌన్సిలర్ మహమ్మద్ రఫీ, సంక్షేమాధికారి పల్లవి తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ముధోల్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని విలేకరులు శనివారం ఎంపీపీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఆ సంఘం మండలాధ్యక్షుడు షఫిఉల్లాఖాన్ తమకు ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం అందించేలా హెల్త్ కార్డులు జారీ చేయాలన్నారు. 50 ఏళ్లు నిండిన వారికి రూ.10వేల పెన్షన్, డబుల్ బెడ్ రూం ఇళ్లను మంజూరు చేయాలని కోరారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

• ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

తానూరు: గ్రామాల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని బోంద్రట్ గ్రామంలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బోంద్రట్‌లో రూ.20 లక్షలతో నిర్మించే పంచాయతీ భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం పొలాలకు వెళ్లేందుకు రూ.25 లక్షలతో నిర్మించిన బిడ్జిని ప్రారంభించారు. సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చంద్రకాంత్, సర్పంచ్ మందాకిని, మాజీ ఎంపీపీ బొశెట్టి రాజన్న, పోతారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నారాయణ్‌రావ్ పటేల్, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

పంచాయతీ కార్మికుల వినతి

భైంసారూరల్: తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని డివిజన్ పరిధిలోని పంచాయతీ కార్మికులు ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. శనివారం మండలంలోని దేగాం గ్రామంలో ఎమ్మెల్యేను తన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబపోషణకు ఇబ్బంది పడుతున్నామని.. నెలకు కనీస వేతనం కల్పించడంతోపాటు పీఎఫ్, ఆరోగ్యబీమా, గుర్తింపు కార్డులు ఇవ్వాలని వారు వేడుకున్నారు.

రైతులకు సలహాలు ఇవ్వాలి

ముధోల్: క్షేత్రస్థాయిలో రైతుల పంటలను పరిశీలించి వారికి సూచనలు, సలహాలు ఇవ్వాలని జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏవో, ఏఈవోలకు పంటలపై శనివారం అవగాహన కల్పించారు. సోయా, మక్క, మినుము, పత్తి, పెసర పంటలను చీడపీడల నుంచి కాపాడుకునేందుకు ఏయే మందులు వాడాలో తెలియజేయాలని పేర్కొన్నారు. ఏవో భాస్కర్, ఏఈవోలు పాల్గొన్నారు.

సారంగపూర్: పంటల వివరాల నమోదులో అలసత్వం వద్దని.. క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులు సాగు చేస్తున్న ప్రతి గుంటను ఏఈఓలు పక్కాగా నమోదు చేయాలని ఏడీఏ వినయ్‌బాబు అన్నారు. మండలకేంద్రంలోని రైతువేదికలో శనివారం ఆయన ఏఈఓలతో సమీక్ష నిర్వహించారు. రైతులకు అందుబాటులో ఉంటూ చీడపీడల నివారణకు సలహాలు, సూచనలు అందించాలని తెలిపారు. ఏఈఓ రాజశేఖర్‌రెడ్డి, ఏఈఓలు తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

మామిడి మొక్కలు పంపిణీ

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్, డ్రీమ్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం రైతులకు బంగినపల్లి మామిడి మొక్కలు పంపిణీ చేశారు. రిలయన్స్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ సుధాకర్, దిగంబర్‌పటేల్, కార్యదర్శులు సారిక, రాజబాపు, హెచ్ఎం ఎల్లన్న ఉన్నారు.

శనీశ్వరుడికి ప్రత్యేక పూజలు

లోకేశ్వరం: మండలంలోని భాగాపూర్ గ్రామ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఆవరణలో శనీశ్వరుడికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆషాడ మాసంలో శనిదేవుడికి నవధాన్యాలతో తైలాభిషేకం చేస్తే శని భగవంతుడు ప్రీతి చెంది ఆయురారోగ్యాలు ఇస్తాడని వేద పండితులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ఊరూరా మొక్కలు నాటాలి

కుంటాల: హరితహారంలో భాగంగా ఊరూరా మొక్కలు నాటాలని ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో మొక్కలు నాటించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

'కుల రాజకీయాలు సరికాదు'

లక్ష్మణచాంద: కుల రాజకీయాలు చేయడం సరి కాదని లక్ష్మణచాంద జెడ్పీటీసీ వొస రాజేశ్వర్, బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి అడ్వాల రమేశ్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఇటీవల జిల్లా కేంద్రానికి చెందిన నిర్మల్ మున్సిపల్ మాజీ చైర్మన్ అప్పాల గణేశ్ చక్రవర్తి బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా మంత్రి ఐకేరెడ్డి ఆశీర్వాదం తీసుకున్నారని పేర్కొన్నారు. దీనిపై కాంగ్రెస్ నాయకులు శ్రీహరిరావు నిర్మల్‌లో మాట్లాడుతూ గణేశ్ చక్రవర్తి మున్నూరు కాపుల ఆత్మగౌరవం మంత్రి దగ్గర తాకట్టు పెట్టారనడం సరికాదన్నారు. ఓస మల్లయ్య పాల్గొన్నారు.

పోలీసులకు సన్మానం

నిర్మల్‌రూరల్: నిర్మల్‌రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు సేవా పథకాలకు ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న నర్సయ్య, జయకిష్టను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై చంద్రమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో బాలసభ

సోన్: మండలంలోని జాఫ్రపూర్ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రధానోపాధ్యాయులు తోదిశెట్టి పరమేశ్వర్ ఆధ్వర్యంలో బాలసభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తాము నేర్చుకున్న పాఠాలు, పద్యాలు, శ్లోకాలు, సూక్తులు, పొడుపు, నీతి కథలు చదివి వినిపించారు.

సమ్మెకు మద్దతు

ఖానాపూర్: తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సునారికారి రాజేశ్ అన్నారు. శనివారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట 10వ రోజు సమ్మెలో కార్మికులకు మద్దతుగా బైఠాయించారు.అంతకుముందు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్, సీపీఐఎంఎల్(ప్రజాపంథా) ఉమ్మడి జిల్లా కార్యదర్శి రామయ్య కార్మికులకు మద్దతు తెలిపారు.